ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 4 అక్టోబరు 2024

రేషన్ కార్డులకు మోక్షమెప్పుడో..?

- మళ్లీ వాయిదాపడ్డ దరఖాస్తుల ప్రక్రియ
- తొమ్మిది నెలలు గడిచినా కార్డులు ఇవ్వని ప్రభుత్వం
- కార్డుల్లేక ప్రభుత్వ పథకాలకు దూరం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కొత్త రేషన్ కార్డుల జారీకి మోక్షం లభించడం లేదు. ఈనెల 2వ తేదీ నుంచి కొత్త దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ప్రక్రియను నిలిపి వేసింది. దీంతో అర్హులైన వాళ్ల ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల నుంచి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారి నిరీక్షణ ఫలించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్త కార్డులను జారీ చేయడం లేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ 2018 వరకు క్రమం తప్పకుండా నిరంతరం రేషన్ కార్డులను జారీ చేసింది. 2018 డిసెంబర్లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. ఆ తర్వాత అనేకమంది దరఖాస్తులు చేసుకోగా, వాటిని 2022 సంవత్సరంలో పరిశీలించి, అందులో అర్హులైన వారికి కార్డులను కొత్తగా జారీచేశారు. ఆ వెంటనే వెబ్ సైట్‌ను మూసివేసిన ప్రభుత్వం మళ్లీ రేషన్ కార్డులు ఇవ్వలేదు. నవంబర్‌లో జరిగి న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. ఆ మేరకు రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. ఆరు గ్యారంటీ పథకాలతో పాటు కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రకటించారు. మొదట డిసెంబర్ 9వ తేదీ నుంచి ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, చేయూత పథకంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు ఉచితంగా ఆరోగ్యాన్ని అందించేందుకు ప్రారంభించారు. పలు పథకాలను అమలు చేసేందుకు డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో ఐదు గ్యారంటీ పథకాలు వర్తించేందుకు స్వీకరించిన దరఖాస్తులతో పాటు, కొత్త రేషన్ కార్డుల కోసం కూడా అధికారులు దరఖాస్తులను స్వీకరించారు.

ఆ దరఖాస్తుల్లో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు 2,500 రూపాయలు ఇవ్వడం, రూ. 500కే వంట గ్యాస్ ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, తెలంగాణ ఉద్యమ కార్డులకు 250 గజాల స్థలంతో పాటు ఇళ్ల మంజూరు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, చేయూత కింద కొత్తగా పింఛన్ మంజూరు కోసం ప్రజాపాలన దరఖాస్తు ఫారాన్ని రూపొందించారు. వాటన్నింటినీ భర్తీ చేసి అధికారులకు ప్రజలు అందజేశారు. వీటితో పాటు రేషన్ కార్డులు లేనటువంటి వాళ్లు తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లాలో 15,670 దరఖాస్తులు

జిల్లాలో రేషన్ కార్డుల కోసం 15,670 దరఖాస్తులు వచ్చాయి. వాటిని జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఆ తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉప సంఘం అర్హులైన వారికి రేషన్‌కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేసింది.

ఈ నెల 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిం చామని ప్రకటించినప్పటికీ, ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసింది. దీంతో రేషన్ కార్డుల జారీ కోసం ఎదురుచూస్తున్న వాళ్లు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. రేషన్ కార్డులు లేక మార్చి 1 నుంచి అమల్లోకి వచ్చిన రూ. 500కే సబ్సిడీ వంట గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం పొందలేకపోతున్నారు. 2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేయగా, కార్డులు లేని వారికి రుణమాఫీ కాలేదు. సంబంధిత అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ప్రభుత్వానికి నివేదికను పంపించారు. కానీ ఇంకా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. అదే రేషన్ కార్డు ఉంటే అందరితో పాటు తమకు కూడా రుణమాఫీ అయ్యేదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త రేషన్ కార్డులను జారీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు జరుపుకోవాలి

- అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇస్తే లాడ్జిల సీజ్
- సెలవుల్లో వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి : సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 3: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో దేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాల్లో 566విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. రోడ్లపై మండపాలు పెట్టవద్దని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా పెట్టాలన్నారు. మండపాలకు సంబంధించి సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో అనుమతులు తీసుకోవాలని, విద్యుత్‌శాఖ నుంచి అనుమతి తీసుకుని విద్యుత్ వాడాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నిత్యం అప్రమత్తతో ఉండాలన్నారు. నిమజ్జనానికి సంబంధించి సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులతో సమన్వయంతో మెలగాలన్నారు. రెచ్చగొట్టే పోస్టర్లు వేయడం కానీ, కరపత్రాలు పంచడం కానీ చేయవద్దని సూచించారు. దుర్గ మాత మండపాల భద్రతకు సంబంధించి ప్రత్యేకంగా క్లస్టర్లు ఏర్పాటు చేశామని, బ్లూకోల్ట్స్, పెట్రోకార్, నైట్ పెట్రోలింగ్‌లతో నిఘా పెడుతామన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాద మోపామని, వంద కేసులు నమోదు చేశామన్నారు. ఇతర రాష్ట్రాల్లోని నెట్‌వర్క్‌ను ఛేదించే ప్రయత్నం కూడా చేస్తున్నామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వేదిక అయ్యే లాడ్జ్‌లను సీజ్ చేస్తామని, మంచిర్యాలలో రెండు లాడ్జిలను సీజ్ చేశామన్నారు. లాడ్జిలో పేకాట, వ్యభిచారం, మద్యపానం వంటి వాటిని ఉపేక్షించేది లేదని సీపీ హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో సీసీ కెమెరాల పని తీరు మరింత మెరుగు పరిచేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళతామన్నారు.

లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు

కోల్‌సిటీ, అక్టోబరు 3: గోదావరిఖని పట్టణంలోని పలు లాడ్జిలు, హోటళ్లల్లో వన్‌టౌన్ పోలీసులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిల మేనేజర్ల నుంచి ఎవరెవరు ఉంటున్నారనే విషయాల గురించి ఆరా తీశారు. అడ్రస్ ప్రూఫ్‌లు, ఇతర వివరాలను సేకరించారు. కాగా లాడ్జిల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అనుమతించవద్దని, పేకాట, మద్యం సేవించడం, వ్యభిచారం వంటి కార్యకలాపాలకు అవకాశం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించాలి

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 3: మండలంలోని పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను సకాలంలో పరిష్కరించాలని అదనపుకలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో ఉన్న పెండింగ్ ధరణి సమస్యలు,భూసేకరణ, వివిధ సర్టిఫికెట్ల జారీ మొదలగు అంశాలపై రివ్యూ నిర్వహించారు. మండలంలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో అవసరమైన ధ్రువీకరణ చేపట్టి పెండింగ్ దరఖాస్తులు పూర్తిచేయాలన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సర్టిఫికెట్లు జారీ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో మండల తహసీల్దార్ వకీల్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఆర్‌ఐలు రాజేందర్, అజీమ్ ఉన్నారు.

గోదావరిఖనిలో బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 3: పండుగ పూట ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపాల్సిన ఆర్‌టీసీ అధికారులు బస్సులు సమయానికి నడపక పోవడంతో గురువారం గోదావరిఖని బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. వచ్చిపోయే బస్సుల కోసం ప్రయాణికులు పరుగులు తీయడం, సీట్ల కోసం కుస్తీలు పడడం వంటి దృశ్యాలు కనిపించాయి. కాలేజీలకు, హాస్టళ్లకు, స్కూళ్లకు బుధవారం నుంచి సెలవులు ప్రకటించడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన నాటి నుంచి ఆయా రూట్లలో బస్సుల సంఖ్య తగ్గించడం వల్ల ప్రయాణీకులు తిప్పలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా హైదరాబాద్, కరీంనగర్ వంటి రూట్లలో ప్రత్యేక బస్సులను నడిపేవారు. కానీ ఇప్పుడు అవి కానరావడం లేదు.

మరోవైపు ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు వేసి ప్రయాణికుల వద్ద నుంచి అత్యధిక చార్జీలను వసూలు చేస్తున్నారు. పల్లె వెలుగుతోపాటు ఆర్డినరీ బస్సులకు భూపాలపల్లి, కరీంనగర్, మంచిర్యాల వంటి రూట్లలో ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు ఏర్పాటు చేయడం, ఆ బస్సులు కూడా సమయానికి గమ్య స్థానాలకు చేరడం లేదు. దీంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు, సిబ్బంది ప్రతిభను గుర్తించడానికి డ్యూటీ మీట్

- రాష్ట్ర ఏర్పడిన తర్వాత కాళేశ్వరం జోన్‌లో మొదటిసారి నిర్వహణ
- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



డ్యూటీ మీట్‌లో బాంబు స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ, అక్టోబరు 3: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటి సారిగా డ్యూటీ మీట్ జరుగుతుందని, దానిలో భాగంగా కాళేశ్వరం జోన్‌లో జోన్ స్థాయి డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కాళేశ్వరం జోన్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని అధికారులు, సిబ్బందికి జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ మీట్‌ల వల్ల నైపుణ్యం, సామర్థ్యం మెరుగుపడుతాయని, అధికారులు, సిబ్బందిలో ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ఇప్పటికే కమిషనరేట్ స్థాయిలో డ్యూటీ మీట్ నిర్వహించామని, ఇప్పుడు జోన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జోన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 14 నుంచి 18వరకు జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామని, అందులో జోన్ ప్రతిభను చాటాలన్నారు. సైటింఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ ఈవెంట్, యాంటీ సబొటేజ్‌చెక్, కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్ ఈవెంట్, డాగ్‌స్క్వాడ్ కాంపిటీషన్‌లలో ఈవెంట్స్‌ను ఉంటాయన్నారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫింగర్‌ప్రింట్ ఇన్వెస్టిగేషన్ కోసం సాంకేతిక పరిజ్ఞానం, కేసుల మెళకువలు నేర్చుకునేందుకు డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. సంక్లిష్టమైన కేసులను పరిష్కరించడానికి పరస్పర ఆలోచనల మార్పిడి సాధ్యమవుతందని, ఒకరి నుంచి ఒకరు అనుభవనాలను కూడా తెలుసుకుంటారన్నారు. వృత్తిపరమైన సామర్థ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. ఈ డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే డ్యూటీ మీట్‌లకు పంపుతారన్నారు.

ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, ములుగు ఏసీపీ రాములు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్, ఆర్‌ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్, మల్లేషం, శ్రీనివాస్, కమిషనరేట్ పరిధిలోని పలు జిల్లాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

- ఐదు రోజుల్లో వివరాల సేకరణ పూర్తి చేయాలి - పీహెచ్‌సీల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్

ముత్తారం, అక్టోబర్ 3: గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని కవర్ చేస్తూ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ముత్తారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఫ్యామిలీ డిజిటల్ సర్వే పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన మండలంలోని దర్యాపూర్ గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి జరుగుతున్న సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ చేసేందుకు చేపట్టిన సర్వేలో గ్రామంలోని ప్రతి కుటుంబం వివరాలు పకడ్బందీగా సేకరించాలని, 5రోజుల్లో కుటుంబ వివరాల సేకరణ పూర్తిచేయాలని, ఈనెల 9న సేకరించిన వివరాల స్క్రూటినీ చేసి, 10న ఫ్యామిలీ డిజిటల్ కార్డుకు సంబంధించి సమాచారంతో కూడిన నివేదిక సమర్పించాలని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు, పెండింగ్ భూసమస్యల వివరాలు తెలుసుకొని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. అలాగే ముత్తారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్‌సీడీ సర్వే అమలవుతున్న తీరు, ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాల వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆసుపత్రిలో అవసరమైన మేర మందుల స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. రోగులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో సురేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీలతో పాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దరియాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పక్కా కార్యాచరణతో ధాన్యం కొనుగోలు చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

పెద్దపల్లి, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): పక్కా కార్యాచరణతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, తదితరులతో కలిసి సీఎం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 7 వేలకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కౌంటర్లు, కాంటాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక సీరియల్ నంబర్ కేటాయించాలని, రైస్‌మిల్లులకు తరలించే ధాన్యం బస్తాలపై ఆ సీరియల్ నంబర్ వేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులలో ప్రచారం కల్పించాలని, అదేవిధంగా సన్న రకం దాన్యం గుర్తింపు పక్కాగా జరిగేలా చూడాలని అన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో వచ్చే ఇబ్బందుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా రాష్ట్ర సరిహద్దుల వద్ద పోలీసులు విస్తృత తనిఖీలు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారులు ప్రతిరోజు కలెక్టర్‌లతో కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షించాలని అన్నారు. సీఎంవో అధికారుల సైతం నిరంతరం ధాన్యం కొనుగోలును పరిశీలించాలని, రెగ్యులర్‌గా నివేదికలు అందించాలని అన్నారు. 11,062 టీచర్ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ విజయవంతంగా నిర్వహించామన్నారు. 1:3 నిష్పత్తి ప్రకారం 25,239 మందిని ఎంపికచేసి ఫలితాలు ప్రకటించామన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అయిన అనంతరం 9న సాయంత్రం అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో వ్యాప్తంగా 60 శాతం మేర సన్నరకం ధాన్యం సాగు చేశారని, ప్రభుత్వం 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనాతో చర్యలు తీసుకుంటుందని, దాదాపు 47 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వడ్ల కొనుగోలు చేయబోతున్నామన్నారు. జిల్లా స్థాయిలో అవసరాల మేరకు నూతన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామగ్రి వెంటనే యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అన్నారు. దొడ్డు, సన్న రకం కొనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని అన్నారు. మిల్లర్ల వద్ద ఎటువంటి ధాన్యం కోతలు జరగవద్దని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం భద్ర పరిచేందుకు అవసరమైన మేర గోడౌన్‌లు సన్నద్ధం చేయాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నంబర్‌తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్, అరుణశ్రీ, డీఆర్‌డీఓ రవీందర్, డీఎస్ఓ రాజేందర్, డీఎం ముప్పిడి శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

క్రికెట్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లా అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. గురువారం సెమీ ఫైనల్‌లో నిజామాబాద్‌తో తలపడిన ఉమ్మడి జిల్లా జట్టు విశేష ప్రతిభ చాటి ఫైనల్‌కు చేరింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 పరుగులకు ఆల్ అవుట్ అయింది. కరీంనగర్ జట్టు నుంచి విగ్నేష్ 59 పరుగులు, ఈ తక్షిల్ 38 పరుగులు చేయగా విగ్నేష్ మూడు వికేట్లు, అన్వేష్, అశిష్‌రెడ్డి, రుత్విక్ చెరి రెండు వికెట్లు తీశారని జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు పి మనోహర్‌రావు తెలిపారు. జట్టును జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎన్ మురళీధర్‌రావు, సంఘం సభ్యులు అజిత్‌కుమార్, విద్యాసాగర్ రావు, శ్రవణ్‌కుమార్ అభినందించారు.



పట్టణ పురవీధుల్లో హంస వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

రాజన్న క్షేత్రంలో

దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రంలో దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అధికారులు ఆలయాన్ని తీరొక్క పూలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఉదయం ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతామూర్తులతో పాటుగా రాజరాజేశ్వరీ అమ్మవారికి లలితా సహస్రనామ సహిత చతుషష్టి పూజలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున రాజరాజేశ్వరీదేవి అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట సూపరింటెండెంట్ తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

● హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సాయంత్రం అమ్మవారిని పెద్దసేవపై హంసవాహనంలో నిలిపి పట్టణ వీధులగుండా ఊరేగించారు. భక్తులు దర్శించుకుని తరించారు. అమ్మవారి ఊరేగింపునకు ముందు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొని పెద్ద సేవలో పాల్గొన్నారు. రాజన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సాంప్రదాయ దుస్తులను అందజేశారు.



శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

ధర్మపురి, కొండగట్టులో..

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాల్లో దేవీ నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. లక్ష్మీనృసింహస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు భరత్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్ వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య కలశ స్థాపనలు, విశ్వక్షేన పూజలు, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. శివాలయంలో ఉదయం వేద బ్రాహ్మణులు, రుత్వికులచే మహా సంకల్పం, పృథ్వీ, కలశ, గణపతి పూజ, మండల పూజలతో ప్రధాన కలశ స్థాపనలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మ వారు శైలపుత్రి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం లక్ష్మీ నృసింహ స్వామి వారలను అశ్వ వాహనంపై పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో, తిమ్మాపూర్ సీతా రామచంద్రస్వామి ఆలయంలో, ఒజ్జలవారి వీధిలో, నేరెళ్లలో నవరాత్రులు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధిలో దుర్గాదేవి శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ధర్మపురి క్షేత్రంలో శైలపుత్రి రూపంలో అమ్మవారు



కొండగట్టులో బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

కొండగట్టులో మళ్లీ తలానీలాల టెండర్లు

● 17న నిర్వహణకు ఏర్పాట్లు

● తక్కువ వేలం రావడమే కారణం

మల్యాల, అక్టోబరు 3: కొండగట్టు ఆంజనేయ స్వామి పరిధిలో తలానీలాలు పోగు చేసుకునేందుకు మరోసారి టెండర్లు నిర్వహించనున్నారు. నాలుగోసారి సోమవారం నిర్వహించిన వేలం ప్రక్రియ దాదాపు ఖరారు అయ్యే క్రమంలో తక్కువ వేలం వచ్చిందని అధికారులు మరో సారి నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో పలుమార్లు ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. మార్కెట్‌లో ధరలు లేవనే సాకుతో టెండర్ పెంచకుండా వస్తున్న టెండర్‌దారులు సోమవారం నిర్వహించిన వేలంలో ఏడాది కాలపరిమితికి గాను కేవీఎస్ ఎంటర్‌ప్రైజెస్ రూ.1.76కోట్లు హెచ్చు పాట పలికింది. దీంతో ఖరారు చేయడానికి గాను అనుమతి కోసం కమిషనర్‌కు నివేదించగా తక్కువ వేలం వచ్చిందని, రెండేళ్ల క్రితం రూ.3.64 కోట్లు పలికిన టెండర్ ప్రస్తుతం రెండు కోట్లు దాటకపోవడంతో మరో సారి నిర్వహించాలని కమిషనర్ ఆదేశించడంతో సోమవారం నాటి టెండర్‌ను రద్దు చేశారు. తలనీలాల టెండర్ పెరగకుండా తక్కువ ధరలు పలుకడానికి ఒక్క ప్రాంతం నుంచి టెండర్‌దారులు వస్తుండడమే కారణమని తెలుస్తుండడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 17న టెండర్లు నిర్వహించడానికి అధికా రులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో గతంలో పోగు చేసిన తలనీలాలకు సైతం టెండర్ 17న నిర్వహించనున్నారు.

దసరా తర్వాత డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

గణేశ్‌నగర్, అక్టోబరు 3: రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం మేరకు దసరా తర్వాత డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు శాత వాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ మేనేజ్‌మేంట్ అసోసియేష న్(సుప్మా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.వేంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్య దర్శి శ్రీపాద నరేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాలేదన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో కూడా ఉన్నత విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఫీజు బకాయిల గురించి ఎన్నిసార్లు మంత్రులు, అధికార్ల చుట్టూ తిరిగినా ముఖ్యమంత్రిని కలుద్దామని ప్రయత్నించినా కనీసం సమయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దసరాలోపు ఫీజు బకాయిలు చెల్లించాలని కోరారు. బకాయిలపై ముఖ్యమంత్రి నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు తెరవకూడదని నిర్ణయించామని తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు 8,525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు గురువారం 8,525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 8,525 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 3: జమ్మికుంట వ్యవసాయ మా ర్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 21మంది రైతులు 82క్విం టాళ్ల విడి పత్తి, 34మంది రైతులు 58క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు.

క్రైం కార్నర్

మృతదేహం కోసం గాలింపు

- సొంత బావే హంతకుడు?

కథలాపూర్, అక్టోబరు 3: మండలంలోని చింతకుంటకు చెందిన నేతుల మల్లేశ్ అదృశ్యమైన ఘటనలో మిస్టరీ వీడినట్లు తెలిసింది. సొంత బావే మరి కొందరితో కలిసి హతమార్చినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. మల్లేశ్‌ను చంపిన అనంతరం వరదకా లువలో మృతదేహాన్ని పడేసిన నేపథ్యంలో గురువారం ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో జాలర్లతో అన్వేషణ కొనసాగించారు. దుంపెట శివారు నుంచి తక్కళ్లపల్లి, దమ్మన్నపేట మీదుగా రాంపూర్ పంపు హౌజ్ దాకా జాలర్లతో వెతికినా ఫలితం లేకుండా పోయింది. వరద కాలువ పక్కన ఉన్న చెట్లకు ఎక్కడైనా తగిలి మృతదేహం నిలిచిపోయి ఉంటుందనే అనుమానంతో వెతికారు. మంగళవారం అర్ధరాత్రి మల్లేశ్‌తో కలిసి తన బావ మరి కొందరు మద్యం తాగగా అక్కడే మాటా మాటా పెరిగి ఇద్దరి మధ్య తోపులాట జరిగినట్టు తెలిసింది. అదే క్రమంలో పక్కనే ఉన్న వరద కాలువలో పడేసినట్టు మృతుడి బావ అంగీకరించాడని తెలుస్తోంది. మృతదేహం కోసం పోలీసులు వరద కాలువ ప్రవాహాన్ని తగ్గించి గాలింపు చేపట్టారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, అక్టోబరు 3: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో ఈనెల 1న నన్నపునేని విద్యాసాగర్‌ను చంపిన తమ్ముడు నన్నపునేని విక్రమ్‌రాజ్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. గురువారం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ విలేకర్ల సమావేశంలో హత్య వివరాలు వె ల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు విద్యాసాగర్, తమ్ముడు విక్రమ్‌రాజుకు కొన్ని రోజులుగా భూవివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఖే తగాదాలను మనసులో పెట్టుకొని ఎలాగైనా విద్యాసాగర్‌ను అంతమొందించాలని విక్రమ్‌రాజు పథకం రూపొందించాడు. ఈక్రమంలో ఈనెల 1న తన ఇంటి సమీపంలో పాత పగలు మనసులో పెట్టుకొని వాగ్వివాదానికి దిగాడు. మాటా మాటా పెరిగి విద్యాసాగర్ తలపై తమ్ముడు విక్ర మ్‌రాజు రోకలిబండతో బలంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై సధాకర్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టగా అంతర్గాం శివారులో నిందితుడు విక్రమ్‌రాజును మధ్యాహ్నం సమయంలో పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డిని, ఎస్సై సధాకర్‌ను, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రఘుచందర్ అభినందించారు.

ఆలయంలో చోరీ

- వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన దొంగలు

జగిత్యాలరూరల్, అక్టోబరు 3: జగిత్యా ల రూరల్ మండలంలోని బాలపల్లి గ్రామంలో గల రాజరాజేశ్వర దేవాల యంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని కిలో వెండి నాగభరణం, అరతులం వెండి, అరతులం బంగారు చైన్ ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెనుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

గంభీరావుపేట, అక్టోబరు 3: గంభీరావుపేట మండలం బరిగెల గూడెం కాలనీకి చెందిన శనిగరపు జీవన్ (31) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ సమీపాన గల వ్యవసాయ బీడు భూమిలో చెటుకు ఉరి వేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. జీవన్ గత కొంత కాలంగా షుగర్ వ్యాధిలో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. తరుచూ వ్యాధి తీవ్రతపై బాధపడుతూ జీవన్ ఇంట్లో చెప్పుకునేవాడు. వ్యాధి ప్రబావాన్ని తట్టుకోలేక నిత్యం మనస్తాపం చెందేవాడు. గురువారం ఉదయం టీ తాగి వస్తానని చెప్పి జీవన్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, గ్రామ సమీపాన ఉన్న ఓ బీడు భూమిలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవన్ తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోల్‌సిటీ, అక్టోబరు 3: గోదావరిఖని గంగానగర్ గోదావరి వంతెన వద్ద గురువారం రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ఆటోలను రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గోదావరిఖని నుండి ఆటోలో మంచిర్యాల వైపునకు బియ్యం తరలిస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు జరిపారు. ఆటోలో ఉన్న 8.5క్విం టాళ్ల బియ్యాన్ని స్వాధీనపర్చుకుని ఆటోలను సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న తూర్పాటి ప్రకాష్, చింతల చిన్నలను అదుపులోకి తీసుకున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



అవినాష్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 3: రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొమ్మకంటి అవినాష్(28) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బొమ్మకంటి రమ్య- రవీందర్ దంపతుల చిన్న కొడుకు అవినాష్ కొంత కాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివసిస్తుండేవాడు. రెండు రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన అక్కడి చుట్టు పక్కల వారు ఆసుపత్రికి తరలించి ఎల్లారెడ్డిపేటలోని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు రోజులుగా చికిత్స పొందుతున్న అవినాష్ పరిస్థితి విషమించి గురు వారం చనిపోయాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వ హించారు. యువకుడు ప్రేమ వ్యవహారం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికంగా చర్చించుకుంటున్నారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్ పరామర్శించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

ముత్తారం అక్టోబరు 3: మండలంలోని ఖమ్మంపల్లి మానేరు వాగు వద్ద గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం కొట్టుకు వచ్చింది. గ్రామపంచాయతీ సెక్రెటరీ ఇచ్చిన సమాచాం మేరకు ఎస్సై గోపతి నరేష్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలం వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరీక్షించారు. వృద్ధురాలి వయసు 50 నుంచి 65 సంవత్సరాల ఉంటుందని, పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉండి ఒంటిపై ఎర్ర చీర, ఎర్ర జాకెట్టు ధరించి ఉందని, మృతదేహం గుర్తు పట్టలేకుండా ఉందన్నారు. పంచాయతీ సెక్రెటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గోదావరిఖనిలో సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ దాడులు

- రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

- 40క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోల్‌సిటీ, అక్టోబరు 3: 'దర్జాగా రేషన్ బియ్యం దందా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై పౌర సరఫరాలశాఖ స్పందించింది. గురువారం పౌర సరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు గోదావరిఖనిలో దాడులు నిర్వహించారు. గోదావరిఖనిలో రేషన్ బియ్యం దందా చేస్తున్న కింగ్‌పిన్‌పై ఫోకస్ పెట్టారు. సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో బృందం నిఘా పెట్టిం ది. గురువారం సాయంత్రం గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లి రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుల గోడౌన్‌ల నుంచి బియ్యం తరలిస్తుండగా వ్యాన్(టీఎస్22టీఏ1039)ను పట్టుకున్నారు. అందులో 84బస్తాల్లో ఉన్న 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. పౌరసరఫరాలశాఖ రామగుండం ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్‌లో బియ్యం తరలిస్తున్న పాశం విక్రమ్‌పై కేసు నమోదు చేశారు.

● కాగా గోదావరిఖనిలో సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ దాడులు జరు గుతున్నాయనే సమాచారంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని రేషన్‌షాపులు మూసివేశారు. రేషన్ షాపుల్లో నుంచి నేరుగా అక్రమ రవాణాదారులకు బియ్య రవాణా జరుగుతుందనే సమా చారంతో టాస్క్‌ఫోర్స్ నిఘా పెట్టింది.

నలుగురు దొంగల అరెస్టు

- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీపీ క్రిష్ణ

సుల్తానాబాద్, అక్టోబరు 3: కూలీ పనులు చేస్తూ వచ్చే సంపాదన సరిపోవడం లేదని భావించిన కొందరు ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేయ డమే వృత్తిగా ఎంచుకున్నారని, ఇందులో నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. దొంగలందరూ మంచిర్యాల జిల్లాకు చెందినవారని, కొన్ని సంవత్సరాల నుంచి వీరు ఆస్తి సంబంధిత నేరాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రాత్రివేళలో తాళం వేసి ఉన్న ఇళ్లను, షాపులను ఎంచుకుని వాటి తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించి దొంగతనాలు చేస్తున్నారని, వీరిలో గతంలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని, కొందరు జైలుకు కూడా వెళ్లివచ్చారన్నారు. ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు ఏసీపీ వివరించారు. అరెస్టయిన వారిలో మంచిర్యాల జిల్లా మందమర్రికి యాపల్‌కు చెందిన పిట్టల సురేందర్, మందమర్రి విద్యానగర్‌కు చెందిన సిలివేరు శంకరయ్య, బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన గోషిక కార్తీక్, మందమర్రి చెత్లాపూర్‌కు చెందిన పసుపులేటి శ్రీనివాస్‌లు ఉన్నారు. వీరి ముఠాలోని గుర్రాల చిన్న భూమయ్య, రాము అనే వ్యక్తులు పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. గతనెల 23 అర్ధరాత్రి ప్రాంతంలో సుల్తానాబాద్‌లోని కరీంనగర్ రోడ్డులోగల శాస్త్రినగర్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో ఈ దొంగలు కిటికీ రాడ్స్‌ను కట్ చేసి లోపలికి వెళ్లి 300కిలోల కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుడు గాయం నరేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తాము దర్యాప్తు చేయగా ఈ దొంగలు పట్టుబడ్డారని చెప్పారు. గురువారం ఉదయం ఇదివరకు దొంగతనం చేసి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో మళ్లీ దొంగతనానికి రాగా పోలీసులు వారిని పట్టుకుని విచారించగా దొంగలు అందరూ పట్టుబడ్డారని తెలిపారు. అయితే చోరీ చేసిన కాపర్ వైర్‌ను కొంత అమ్మి డబ్బులు పంచుకున్నారని, మిగతా కొంత వైర్ వీరి వద్ద ఉంచుకున్నారని, దొంగలు హైదరాబాద్‌లో విక్రయించిన రాము అనే వ్యక్తి వద్ద కూడా రాగి వైర్ రికవరీ చేశా మన్నారు. ఈ దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసులతో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ క్రిష్ణ

'మంత్రి సురేఖ క్షమాపణ చెప్పాలి'

మంథని, అక్టోబర్ 3: మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు మహిళా లోకాన్నే కించపర్చే విధంగా ఉన్నాయని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ఆరోపించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి కొండ సురేఖ మహిళలకు, హీరోయిన్ సమంతకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సాటి మహిళలపై అసభ్యకరంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ తగరం సుమలత, నాయకురాళ్ళు పుట్ట పద్మ, బుద్దార్తి రాణి, పుప్పాల భాగ్యలక్ష్మి, ఐలి రాజేశ్వరీ, ఆరెపల్లి తిరుమల, రేణుకలు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 3: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ దసరా సెలవుల తర్వాత ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధిక బంద్‌కు సిద్ధమయ్యాయి. ఈమేరకు శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం(సుప్మా) అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి శ్రీపాద నరేష్, కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

షీ టీమ్, డ్రగ్స్‌పై అవగాహన

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 3: గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో గురువారం షీటీమ్, యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్‌ఐ మల్లన్న మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా 6303923700 నంబరుకు ఫోన్ చేసి తెలపాలని, ఆన్‌లైన్ మోసాలకు 1930కి ఫోన్ చేయాలన్నారు. షీటీమ్ సిబ్బంది స్నేహలత, సురేష్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామగిరి అక్టోబర్ 3: మండలం పరిధిలోని రత్నాపూర్, పన్నూరు శివారుల్లో ఇసుక అక్రమ రావాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకుమార్ గురువారం తెలిపారు. ఎనిమిది మంది ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పనుల పరిశీలన

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 3 : హన్మంతునిపేటలో చేపడుతున్న మురికికాలువ నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో ఘనుకోట శ్రీదర్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ రవింద్రనాధ్‌తో కలిసి పరిశీలించారు. వెంట బయ్యాపు కోమురయ్య తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 3 : రాఘవపూర్‌లోని రెడ్డి వృద్ధాశ్రమంలో గురువారం వయోవృద్ధులకు జిల్లా మహిళా సాధికారిక కేంద్రం, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్నకుమారి, ఏడీపీహెచ్‌వో డాక్టర్ రాజమౌళి, డాక్టర్ మమత, ఎంవో రాఘవపూర్, మధుసూదన్, చంద్రు స్వప్న, విమల, తిరుపతమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయంలో పూజలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 3 : పెద్దపల్లి పట్టణంలోని, మినీ ట్యాంక్ బండ్, ఎల్లమ్మ చెరువు సమీపంలో, కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో, దేవి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప సురేందర్‌లు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వ్యవసాయ కమిటీ చైర్మన్ స్వరూపను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పోతాని పురుషోత్తం, బూతగడ్డ సంపత్, ఆలయ కమిటీ సభ్యులు గండు రంగయ్య, చంద్రగిరి రవి, గుడికందుల శ్రీనివాస్, నక్క సంతోష్, ఈర్ల సురేందర్ పాల్గొన్నారు.

ఉత్తమ రెస్పాన్స్ ఆఫీసర్ అవార్డు


కళ్యాణ్‌నగర్, అక్టోబరు 3: వయో వృద్ధుల సంక్షేమం కోసం కృషిచేస్తున్న గోదావరిఖనికి బాల స్వర్ణలత బుధవారం రాత్రి ఉత్తమ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ అవార్డును హైదరాబాద్‌లో మంత్రి సీతక్క అందజేశారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

నియామకం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 3: కాలనీ కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా 15వ డివిజన్‌కు చెందిన సారయ్య నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు.

'చౌకబారు రాజకీయాలు మానుకోవాలి'

కమాన్‌పూర్, అక్టోబరు 3 : కాంగ్రెస్ నాయకులు చౌకబారు రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు హితవు పలికారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మేకల సంపత్‌యాదవ్, పొన్నం రాజేశ్వరి, బొమ్మగాని అనిల్‌గౌడ్, గుర్రం లక్ష్మీమల్లు, చిందం తిరుపతి, తాటికొండ శంకర్, వెంకటేష్, ఆకుల గట్టయ్య, నీలం శ్రీనివాస్, భాస్కర్, శంకర్‌గౌడ్, చొప్పరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


ఖమ్మంపల్లిలో..


కమాన్‌పూర్‌లో..


నిట్టూరులో..


గోదావరిఖనిలో..

ఘనంగా ప్రారంభమైన దేవి శరన్నవరాత్రులు

- వాడవాడలా మండపాలు.. - బాల త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, అక్టోబరు 3: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గురువారం దేవిశరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి విగ్రహాలను మండపాలకు తరలించారు. పవర్ హౌస్‌లోని అమ్మవారి ఆలయం, జయదుర్గాదేవి ఆలయంలో భక్తులు మాలధారణ స్వీకరించారు. తొలిరోజు అమ్మవారు భక్తులకు బాలత్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు. జవహర్‌నగర్‌లోని జయదుర్గాదేవి ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, స్నేహలత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 42వ డివిజన్ కళ్యాణ్‌నగర్ బాల రాజ్‌కుమార్, మీనాక్షి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు.

మంథని : మంథనిలో దేవి శరన్నవరాత్రోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీమహాలక్ష్మీ ఆలయంలో వేద పండితులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శరన్నవరాత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అవరణలో సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగ నిర్వహించారు. ఆలయ సమీపంలోని శ్రీపెద్ద పోచమ్మ తల్లి వద్ద కూడా భక్తులు పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం, సుభాష్‌నగర్, గాంధీచౌక్, తమ్మచెరువుకట్ట, ఎరుకలగూడెం, పోచమ్మవాడల్లో శ్రీదుర్గాదేవి విగ్రహాలను భక్తులు ప్రతిష్ఠించారు. శ్రీకన్యకాపరమేశ్వరి, శ్రీలలితాంబిక ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ముత్తారం : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఖమ్మంపల్లి, ముత్తారం, లక్కారం, కేశనపల్లి, మచ్చుపేట గ్రామాల్లో గురువారం దుర్గామాత కొలువుదీరింది. మొదటిరోజు భక్తులకు బాల త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకొక రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

ఓదెల : మండలంలో గురువారం నుంచి దుర్గ మాత నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఓదెలతో పాటు పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్, మడక, గుంపుల, నాంసానిపల్లి, జీలకుంట, శానగొండ గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించారు. యువకులు మాలధారణ నిర్వహించి దేవి దీక్షను చేపట్టారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని మంగపేట, పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్ తదితర గ్రామాల్లో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం దుర్గామాతను ఆలయాల్లో ప్రతిష్ఠించారు. మొదటి రోజు బాలత్రిపుర సుందరి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మంగపేటలో మాజీ ఎంపీపీ నూనెటి సంపత్‌యాదవ్, కాల్వశ్రీరాంపూర్‌లో పులి ఇంద్రకరణ్‌రెడ్డిలు దుర్గామాత విగ్రహాలు ఇవ్వడం జరిగింది. దాసరి ఉష, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, పులి ఇంద్రకరణ్‌రెడ్డి దుర్గామాతకు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని నిట్టూరు, బ్రాహ్మణపల్లి, చీకురాయి, భోజన్నపేట, గౌరెడ్డిపేట గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. యువకులు దుర్గా మాత దీక్షను చేపట్టారు. గురువారం శ్రీబాలాత్రిపుర సుందరిదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

కమాన్‌పూర్ : మండలంలో దేవి నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలకేంద్రంలో ఛత్రపతి శివాజి యువసేన ఆధ్వర్యంలో మండపాన్ని అలకరించి అమ్మవారిని ప్రతిష్ఠించారు. యువసేన వ్యవస్థాపకుడు జంగపల్లి శ్రీనివాస్, అధ్యక్షుడు జంగపల్లి సతీష్, నాయకులు మోర ప్రశాంత్, మల్యాల శేఖర్, నరేష్, గోపిక వరప్రసాద్, జంగపల్లి శ్రీనివాస్, రవి, కొత్తపల్లి సతీష్, వినీత్, శ్రీనివాస్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.


మంథనిలో


ఓదెలలో..


కాల్వశ్రీరాంపూర్‌లో..

డిజిటల్ ఫ్యామిలీ కార్డులపై సర్వే


సర్వే నమోదు వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, అక్టోబరు 3: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 48వ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్టుగా డిజిటల్ ఫ్యామిలీ కార్డులపై గురువారం నుంచి సర్వే జరుపుతున్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ సర్వే తీరును పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ పొన్నం విద్య, ఇతరులతో మాట్లాడారు. కార్పొరేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ రాజు, ఆర్‌ఓ కరుణాకర్, మున్సిపల్ ఉద్యోగులు పబ్బాల శ్రీనివాస్, కార్పొరేటర్ పొన్నం విద్య, స్థానిక నాయకులు లక్ష్మణ్‌గౌడ్, అంగన్‌వాడీ, ఆర్‌పీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : మండలంలోని దుబ్బపల్లిలో బుధవారం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన సర్వేను ప్రారంభించారు. సర్వే కార్యక్రమాన్ని పెద్దపల్లి ఆర్‌డీవో గంగయ్య, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, తహసీల్దార్ మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని గుడిపల్లిలో గురువారం ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే నిర్వహించారు. ఎంపీడీవో పొల్సాని శశికళ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ ఎం జ్యోతి, ఏఈఓపీఆర్వో, ఎంపీవో ఉప్పు సుదర్శన్‌లు టీములుగా ఏర్పడి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎస్ సుమలత, జి సంతోష్, పెండ్లి సాయిచరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 3 : మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన కుర్మ రాంప్రసాద్ (28) అనే యువకుడు మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాంప్రసాద్ మేషన్ పనిచేసుకొని జీవిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం పెళ్లి కాగా, రెండు నెలల క్రితం అతని భార్య డెంగ్యూతో మృతిచెందింది. అప్పటినుంచి తీవ్ర మనోవేదనకు గురైన రాంప్రసాద్ మద్యానికి బానిసై బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి కుర్మ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 3: పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామంలో ఎంపీడీవో ఘనుకోట శ్రీధర్, ఎంపీవో ఫయాజ్‌లు పలు పారిశుధ్య పనులను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా మండలంలోని 30 గ్రామాల్లో నూతనంగా విధుల్లో చేరిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో ఘనుకోట శ్రీధర్, ఎంపీవో ఫయాజ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అహ్మద్ పాష, అంజద్ పాష, లక్ష్మణ్ బాబు, ప్రశాంత్, నిషాంత్‌రావు, రవి, సంపత్ పాల్గొన్నారు.

'గాయత్రి' ఘనంగా బతుకమ్మ వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 3 : జిల్లా కేంద్రంలోని గాయత్రి జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థినులు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను, తెలంగాణకు ఉన్న అనుబంధాన్ని, పూల విశిష్టతను తెలియచేశారు.

ఈ బతుకమ్మ సంబరాల్లో గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ అధ్యాపక బృందం విద్యార్థిని, విద్యార్థులు బతుకమ్మ ఆట పాటలతో అలరించారు.



గాయత్రి విద్యాసంస్థలో బతుకమ్మ సంబరాలు

కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 3: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ సెలెక్టెడ్ అభ్యర్థులు 289 మంది కాగా వారిని 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. గురువారం వరకు 100 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల ధ్రువీకరణ పూర్తి అయింది. మరో 159 మంది అభ్యర్థులు పరిశీలనలో ఉన్నారు. అభ్యర్థులకు శనివారం వరకు గడువు ఉందని, ఈలోగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలని జిల్లా విద్యాధికారి మాధవి పేర్కొన్నారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాల ప్రకటన

పెద్దపల్లి టౌన్, అక్టోబరు 3: వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా పరిధిలో జాతీయ ఆరోగ్యమిషన్ క్రింద ఆయుష్ విభాగంలో పోస్టులను భర్తీ చేసేందుకు ప్రక్రియ చేపట్టినట్లు డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుష్ వైద్యాధికారి 1, ఫార్మసిస్ట్ 6, స్వీపర్ కమ్ నర్సింగ్ అర్డర్లీ 2 పోస్టుల ఉద్యోగ ప్రకటనకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను శుక్రవారం 11గంటలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నోటీస్‌బోర్డుపై ప్రదర్శించడం జరుగుతుందన్నారు. జాబితాలో అభ్యంతరాలు ఉన్న వారు సంబంధిత పత్రాలతో ఈనెల 9 సాయంత్రం వరకు పరిష్కరించుకోవాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 3: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని భారత్ పెట్రోలి యం కార్పోరేషన్ లిమిటెడ్ మంచిర్యాల ఏరియా సేల్స్ ఆఫీసర్ నాగరాజు అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో పెద్దపల్లి జిల్లా బీపీసీఎల్ డీలర్లతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ పరిసరాలలో చెత్తను తొలగించడంతో పాటు ప్లాస్టిక్ కవర్లను తొలగించారు.

'మంత్రి హోదాను భ్రష్టు పట్టిస్తున్న కొండా సురేఖ'


నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 3: మంత్రి హోదాను కొండా సురేఖ భ్రష్టు పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు దాసరి ఉష విమర్శించారు. గురువారం అయ్యప్ప టెంపుల్ చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దాసరి ఉష నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేటీఆర్‌ను మంత్రి కొండా సురేఖ నోటికి వచ్చినట్టు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోసారి తప్పుడు వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ లైశెట్టి బిక్షపతి, తెలంగాణ జాగృతి నాయకుడు భూమేష్, బీఆర్ఎస్ నాయకులు భీరం రవి, గాజుల రమేష్, అజీమ్, పల్లె రాకేష్, మహేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

ముత్తారం, అక్టోబరు3: మండలంలోని దర్యాపూర్ గ్రామాన్ని హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినందుకు గురువారం ధర్యాపూర్‌లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీల ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే


అభివృద్ధిపనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అంతర్గాం, అక్టోబరు 3: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్, 1వ డివిజన్ పరిధిలోని పాములపేటలో సింగరేణి నిధులు రూ.87లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, పెండ్యాల మహేష్, సింగం కిరణ్ కుమార్‌గౌడ్, ఈదునూరి హరి ప్రసాద్, ఎండీ తాజుద్దీన్, గౌస్ పాల్గొన్నారు.

రేపు వ్యవసాయ సహకార సంఘ భవనం ప్రారంభోత్సవం

ఓదెల, అక్టోబరు 3: మండలంలోని పొత్కపల్లిలో రూ.80 లక్షలకు పైగా నిధులతో నిర్మించిన వ్యవసాయ సహకార సంఘం భవనం, గోదాం సముదాయాన్ని శనివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు హాజరవుతున్నారని తెలిపారు. పాలకవర్గ సభ్యులు, సంఘం ప్రాథమిక సభ్యులు, సహకార బ్యాంక్ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనాలని సుమన్ కోరారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేయాలి

ఎలిగేడు, అక్టోబరు 3: ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసే విధంగా ప్రేరణ కలిగించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు మిట్టపల్లి సురేందర్, సముద్రాల చంద్రమౌళిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం దసరరా కానుకగా నాలుగు డీఏలను ప్రకటించాలని, పాఠశాలలపై ఆన్లైన్, ఆఫ్‌లైన్ పర్యవేక్షణ పేరుతో అధికారులు అధిక ఒత్తిడి చేస్తున్నారన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

జూలపల్లి, అక్టోబరు 3: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం, సోషల్ ఆడిట్ గ్రామసభలను గ్రాపంచాయతీ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు ఏపీవో సదానందం తెలిపారు. మొదటి విడుతలో భాగంగా మండలంలోని కోనరావుపేటలో శుక్రవారం ఉదయం 9.30గంటలకు సోషల్ ఆడిట్ గ్రామసభను ప్రారంభించనున్నట్లు ఏపీఓ పేర్కొన్నారు. ఈనెల 5న వెంకట్రావ్‌పల్లిలో ఉదయం 8.30గంటలకు, వడుకాపూర్‌లో ఉదయం 9.గంటలకు, అబ్బా పూర్‌లో ఉదయం 9.30గంటలకు, కీచులాటపల్లి ఉదయం 10గంటలకు, బాల్‌రాజ్‌పల్లి 8.30 గంటలకు, అలాగే రెండవ విడతలో ఈనెల 6న కుమ్మరికుంట గ్రామంలో ఉదయం 8.30 గంటలకు, పెద్దాపూర్ గ్రామంలో ఉదయం 9 గంటలకు, నాగులపల్లిలో ఉదయం 9.30గంటలకు, జూలపల్లిలో ఉదయం 8.30గంటలకు, చీమలపేటలో ఉదయం 9గంటలకు, తెలుకుంట ఉదయం 10గంటలకు అలాగే కాచాపూర్ లో ఉదయం 9గంటలకు గ్రామసభను నిర్వహిస్తున్నట్లు ఏపీఓ సదానందం పేర్కొన్నారు. అలాగే ఉపాధి హామీ సోషల్ ఆడిట్ ప్రజావేదికను ఈనెల 7న మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఏపీఓ తెలిపారు.

అవార్డుల ప్రదానం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 3: గోదావరిఖని లెనిన్‌నగర్‌కు చెందిన జానపద కళాకారుడు అంబాల రాజయ్య గురువారం తిరుపతిలోని స్వరవాణి కల్చర్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకులు మామిడిపెల్లి రాజబాబు చేతుల మీదుగా అందుకున్నారు. జానపద రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాజయ్యకు నేషనల్ యూనిక్ అవార్డు రావడంపై కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని హన్మంతునిపేటకు చెందిన శ్రీరామకృష్ణ భజన మండలి కళా బృందానికి నేషనల్ యూనిక్ అవార్డు అందుకున్నారు. తిరుపతిలో స్వరవాణి కల్చరల్ ఆర్ట్ అకాడమి, స్నేహ కల్చరల్ ఆర్ట్ అకాడమి వారు అవార్డు అందించారు. ఈ అవార్డులను హన్మంతునిపేట గ్రామానికి చెందిన మ్యాడగోని శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా అందించారు. నాగులమల్యాల వెంకటేషం, బయ్యాపు కోమురయ్య, కారుపాకల కనుకయ్య, కొలిపాక సత్తిబాబు, కందుల సదయ్య, అరెపల్లి రాయలింగు పాల్గొన్నారు.



ఓసీపీ-1లో స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 3: ఓసీపీ-1 ప్రాజెక్టులో గురువారం స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అధికారులతో కలసి పరిసరాలను శుభ్రం చేశారు. బేస్‌వర్క్‌షాప్ ఆవరణలో మొక్కలను నాటారు. ప్రతి ఉద్యోగి వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రతను పాటించాలని, మహాత్మాగాంధీ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. శుభ్రమైన పరిసరాలు, ఆహ్లాదకర వాతావరణం ఉంటే సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పీఓ రాధాకృష్ణ, ఎస్వోటూ జీఎం రఘుపతి, మేనేజర్ ఉదయ్‌హరిజన్, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీలు సదానందం, రమేష్‌తోపాటు అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 3: ఓసీపీ-1లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మైసమ్మ ఆలయంలో ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో మేనేజర్ ఉదయ్‌హరిజన్, డీవైపీఎం సునీల్ ప్రసాద్, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు గడ్డం తిరుపతి, వెంకటస్వామి, తిరుపతిరావు, నాయకులు వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్, సంజీవ్ పాల్గొన్నారు.

కొత్త ప్రాజెక్టులు వచ్చేలా కృషి చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 3: సింగరేణిలో కొత్త ప్రాజెక్టులు వచ్చేలా కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరివి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఓసీపీ-3 సీహెచ్‌పీలో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కొత్త ప్రాజెక్టులకు, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గనులకు అనుమతులు రాకపోవడంతో ఉద్యోగాల భర్తీ ఆలస్యం అవుతుందని, సంస్థ అభివృద్ధి వెనకబడుతుందని అన్నారు. ఏఐటీయూసీ నాయకుడు దివంగత కేఎల్ మహేంద్ర కృషి ఫలితంగా కార్మికులకు లాభాల వాటా అనేది ఏసంస్థలో లేని విధంగా సింగరేణిలో అమలు జరుగుతున్నట్టు తెలిపారు. ఈ గేట్‌మీటింగ్‌లో రాజారత్నం, జీ రవీందర్, అన్నారావు, సాంబశివరావు, సెగ్గెం శంకర్, రవికుమార్, అల్లి రమేష్, రాజ్‌కుమార్, సమ్మయ్య, లక్ష్మీనారాయణ, కిషోర్, రాకేష్ పాల్గొన్నారు.

కార్మిక సంఘాలు క్షమాపణ చెప్పాలి

ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని, అక్టోబరు 3: సింగరేణిలో లాభాల్లో వాటా ప్రకటన విషయంలో టీబీజీకేఎస్‌తో పాటు మరికొన్ని సంఘాలు వాస్తవాలు తెలుసుకోకుండా కార్మికులను తప్పుదోవ పట్టించడంతో పాటు ఏఐటీయూసీపై దుష్ప్రచారం చేశాయని, వెంటనే కార్మికులకు క్షమాపణ చెప్పాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. గురువారం జీడీకే 1ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణికి 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాల్లో వాటా 33శాతం పంపిణి విషయంలో ఏఐటీయూసీ అన్ని బావుల మీద కార్మికులకు వాల్ పోస్టర్ల ద్వారా, గేట్ మీటింగ్‌లలో చార్ట్ ద్వారా వివరించడం జరిగిందని, ఈ విషయంలో ఏమైన తప్పులుంటే దేనికైనా సిద్ధమన్నారు. అసత్య ప్రచారాలు చేసిన కార్మిక సంఘాల నాయకులను సవాలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సింగరేణిలో రానున్న రోజుల్లో తప్పనిసరిగా స్ట్రక్చర్, జేసీసీ సమావేశాలు క్రమ పద్ధతిలో జరిగే విధంగా కృషి చేస్తూ ఎన్నికల ప్రణాళికను అమలు చేసే విధంగా సమస్యలపై పోరాడుతామన్నారు. సింగరేణిలో కార్మికులకు అలవెన్సులపై ఇన్‌కం ట్యాక్స్ యాజమాన్యం చెల్లించే విధంగా, మారుపేర్ల మార్పు, డిపెండెంట్ల విజిలెన్స్ కేసులు, సొంత ఇంటి పథకం తదితర అనేక సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 10ఏళ్లుగా పత్తాలేని ఐఎన్‌టీయూసీ ఇప్పుడు అన్ని మేమే చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రభుత్వం మాదే అని విర్రవీగేటప్పుడు సింగరేణికి రావలసిన రూ.33వేల కోట్ల బకాయిలు ఎందుకు ఇప్పించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు సింగరేణిలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను ఆటంక పరచడం, కంపెనీలో రాజకీయ జోక్యం చేసుకోవడం సరైనది కాదని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని మానుకోవాలని ఆయన హితవు పలికారు. గత ప్రభుత్వం ఎలా పతనమైందో గుణపాఠం నేర్చుకోకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు.

ఏఐటీయూసీ ఆర్జీ-1 వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, ఎస్ వెంకట్‌రెడ్డి, మానాల శ్రీనివాస్, ఎంఏ గౌస్, నేరెళ్ళ తిరుపతి, గంగారపు చంద్రయ్య, ఆర్ రాజేశ్వరరావు, ఎర్రగొల్ల చేరాలు పాల్గొన్నారు.

మైన్స్ రెస్క్యూ పోటీల నిర్వహణపై సమీక్షా సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 3: 53వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల నిర్వహణపై గురువారం రెస్క్యూస్టేషన్ ఆవరణలో సింగరేణి సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అక్టోబర్16, 17 తేదీల్లో జోనల్ స్థాయి పోటీల ను నిర్వహించనున్నట్టు చింతల శ్రీనివాస్ తెలిపారు. పోటీల ఏర్పాట్లు మరియు వర్క్‌అలాట్‌మెంట్‌పై అధికారులతో చర్చించారు. ముఖ్య అతిథులుగా సీఎండీ బలరాం, డైరెక్టర్లతో పాటు డీడీఎంఎస్ అధికారులు, కార్పొరేట్ స్థాయి జీఎంలు కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని చింతల శ్రీనివాస్ అధికారులకు సూచించారు. 7ఎల్ఈపీ గని, రెస్క్యూ స్టేషన్ నందు పోటీల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డితో పాటు వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం శ్రీనివాస్